# వ్యవస్థ

పాన్‌షాపు—

పాన్‌షాపు చుట్టూ మనుషులు—

'కాశ్మీరీ ఖిమామ్'

'తూఫాన్ జర్దా దాళ్కే ఏక్ మీఠాపాన్ బనావ్।'

'సాదాపాన్ బనావ్ మేరేకూ।'

'బర్కిలీప్యాకెట్టొకటియ్యి।।'

'గోల్డ్‌ఫ్లేక్ దేవ్।'

—కిళ్ళీలు, సిగరెట్లు కావాలంటున్నారు.

పాన్‌షాపులో ఇద్దరు మనుషులు—

ఒకడు సిగరెట్లు ఇస్తున్నాడు. మరొకడు యంత్రంకన్నా వేగంగా కిళ్ళీలు కడుతున్నాడు.

పాన్‌షాపుకు ఇరవై గజాల దూరంలో ఒక మనిషి— పేరు ప్రకాశం. ప్రకాశం బుర్రచుట్టూ క్యాలెండర్‌లోని దేవుడిబొమ్మ చుట్టూ వున్న కాంతిలాగ కాంతి ఏమీ కనిపించటం లేదు. కానీ అతని బుర్రలో ఏదో కాంతి మెరిసింది.

కాసేపట్లో—

పాన్‌షాపుకి ఇరవై గజాల దూరంలో ప్రకాశం లేడు. పాన్‌షాపు చుట్టూవున్న మనుషుల్లో ఒకడై ప్రకాశం ఉన్నాడు.

'మీతాపానొకటియ్యి!' గుంపులో చొరబడి అన్నాడు ప్రకాశం. ఇచ్చాడు షాపువాడు. ప్రకాశం కూడ ఇచ్చాడు - రూపాయి. తీసుకుని డ్రాయరు సొరుగుకు అతికించిన గిన్నెలలో ఒకదాంట్లో పడేయబోయి తక్కున ఆగిపోయి—

'యే దూస్రా దేవ్!' అన్నాడు షాపువాడు.

ఆ రూపాయి తనిచ్చింది కాదందా మనుకున్నాడు ప్రకాశం. చుట్టూవున్న జనం, పాన్‌షాపులోవున్న ఇద్దరి మనుషుల ఆకారాలు, పాన్ షాపుకి వేలాడగట్టిన వస్త్రాదుల ఫోటోలు—ఇవేవీ అతన్ని ఆవిధంగా నోరు మెదపనీయలేదు.

'సారీ!' మరోవిధంగా నోరు మెదిపి, ఆ రూపాయి తీసేసుకుని జేబులోవున్న చిల్లర పైసలిచ్చి బైటకు నడిచాడు ప్రకాశం.

నడిచి మళ్ళీ చూశాడు — ఆ ఫోటోలవైపు.

ఒంట్లోవున్న కండలన్నీ కనిపించేట్టుగా, కేవలం కట్‌డ్రాయరుతో తీయించుకున్న ఫోటో ఒకటి.

గుండెల కిందవరకు యాంగిల్‌లో తీయించుకున్న ఫోటో మరొకటి—

అటొకటి, ఇటొకటి!

'వాళ్ళకి సిగ్గేయదులావుంది, అలా ఫోటోలు తీయించుకోవటానికి. పాన్‌షాపు దగ్గిర ఈ ఫోటో లెందుకు! అసలు పాన్‌షాపుకీ శరీరదార్ఢ్యానికీ సంబంధమేమిటి? ఫలానా జర్దాపాన్ వేసుకుంటే ఇలా తయారవుతారా?'

ఆ ఆలోచన మానేయాలనిపించింది ప్రకాశానికి. మానేశాడు.

'ఈ దిక్కుమాలిన సత్తురూపాయిని వదిలించుకోవటమెలాగ ?' మరో ఆలోచన మొలకెత్తింది ప్రకాశం బుర్రలో.

'అసలీ రూపాయి తనదగ్గిర కెలా వచ్చింది ? ఎవరిచ్చారు' ఎక్కడ టోకరా తిన్నాడు తను ? ఆఁ - నిన్న సాయంత్రం ఆనంద్ భవన్‌వాడే ఇచ్చివుంటాడు — నో ! కాదు, ఆనంద్ భవన్‌లో టిఫిన్ తిన్నాక, సినిమా కెళ్ళాడు తను. ఆనంద్ భవన్‌వాడే కనుక ఈ రూపాయిచ్చివుంటే, తను తప్పకుండా సినిమాహాల్లో మార్చేసి వుండేవాడు— అంచేత సినిమాహాలువాడే దీన్ని అంటగట్టి వుంటాడు. కంగారులో తను చూసుకోలేదు కాబోలు; కాబోలేమిటి ? చూసుకోలేదు. టైటిల్సవుతున్నాయి సాబ్ అంటే వాడిచ్చిన చిల్లర జేబులో కుక్కుకుని, హాల్లోకి పరిగెట్టాడు, వెధవన్నర వెధవ కంగారూ తనూనూ!'

ప్రకాశం దగ్గిర ఇంక ఆ రూపాయి తప్ప వేరే డబ్బులేమీ లేవా అంటే - వున్నాయి. కానీ ఆ రూపాయి అతని మనసును కుమ్మరిపురుగులా దొలిచేస్తోంది ఎలాగోలాగ దాన్ని వదిలించుకోవాలి. ఎలాగ ! ఎలాగైనాసరే !

'సోడా చల్లగావుందా ?'

'ఉందిసార్!'

'ఇయ్యి ?'

చ్ చ్ చ్......య్యి! సోడా చప్పుడు. అదోలాగ గొంతులో చప్పుడుచేస్తూ లోనికెళ్ళాయి సోడానీళ్ళు. జేబులోంచి రూపాయి తీశాడు ప్రకాశం.

'చిల్లర్ నహ్యే సాబ్ !'

'చిల్లర లేదుట. పొద్దున్నించీ వీడు ఏమి అమ్మినట్టు? రూపాయి చిల్లరకూడా లేకుండా ఏంచేస్తున్నట్టు?' తిట్టుకుంటూ పదిహేను పైసలు తీసిచ్చాడు ప్రకాశం.

ఆ రూపాయిని మార్చబోతూ కొన్ని అనవసరమైన ఖర్చులు తాను చేస్తున్నానని ప్రకాశానికి తెలుసు. కానీ మారని ఆ రూపాయిని ఎలా గోలాగా మార్చటమే అతనికి కావాలి. ఆ రూపాయిని చూస్తూచూస్తూ రోడ్డుమీద పారేయలేక పోతున్నాడు ప్రకాశం.

రెస్టారెంటుకెళ్ళి—

"చాయ్‌లావ్!" అన్నాడు ప్రకాశం.

"ఏక్ చాయ్‌లావ్!" గట్టిగా అరిచాడు కుర్రాడు, లోపలివాడి నుద్దేశించి. లోపలి వాడికి వినిపించినా వినిపించక పోయినా అలా అర వటం వాడికి అలవాటు.

కాసేపటికి టీ వచ్చింది. తాగాడు ప్రకాశం. కుర్రాడికి రూపాయి ఇచ్చాడు. వాడు ఒల్లొవ్వలేదు. అసలు రూపాయి తీసుకోలేదు.

"క్యాయైసాబ్! వోకైకూ దేరై. దూస్‌రాదేవ్!"

ఏమైంది దీనికి—అని ప్రకాశం అడగలేకపోయాడు. వాడు తన చేతిలో వుండగానే అది సత్తురూపాయని కని పెట్టేశాడు. ఇంక ఏమైనా అడిగితే ఊరుకుంటాడా? తన పరువు తీయడూ!

మర్యాదగా వాడిచేతిలో పావలా పెట్టి బైటకు నడిచాడు—

తన దగ్గిరున్నది సత్తురూపాయి కాకుండా, కాగితం రూపాయి అయివుండి, చిరిగిపోయి వున్నా ఇంత బాధ పడేవాడుకాదు ప్రకాశం. ఎలాగోలాగ మార్చేవాడు. ఇదివరకెన్ని మార్చలేదు! జాగ్రత్తగా అది

కించి, ఏదో అవస్థ పడి మార్చి వుండేవాడు. ఇప్పుడు అవస్థే మిగులు తోంది కాని మారటంలేదు.

''కాకపోయినా ఇలాటి మ ని నాణాలు, నోట్లు ప్రజలమధ్యకు తీసుకొచ్చి ఎందుకింత మోసంచేయాలనుకుంటారో,' అని అలా మోసం చేస్తున్న వాళ్ళని, చేయాలనుకునే వాళ్ళని తిట్టుకున్నాడు ప్రకాశం— తనే అలా చేస్తున్నాననే సంగతి మర్చిపోయి.

బస్సెక్కాడు—

ప్రకాశానికి జనరల్ పాసుంది. అయినా టిక్కట్టు తీసుకోవాలనుకున్నాడు—ఆర్‌టీసీ మీద ప్రేమతోకాదు, రూపాయి మార్చటంకోసం.

"చిక్కడ్‌పల్లి" కండక్టరుకి రూపాయిస్తూ చెప్పాడు.

ప్రపంచ తెలుగు మహాసభలైనప్పటి నుంచీ తెలుగులో మాట్లాడుదామని ప్రయత్నిస్తున్నాడులావుంది—రూపాయి తిరిగి ఇచ్చేస్తూ అన్నాడు కండక్టరు "వేరే ఇదీ ఇంకొకటీ ఇవ్వండిసార్!"

ప్రకాశం తనకప్పుడే గుర్తుకొచ్చినట్టు "అరరే! అయాంసారీ! నాకు జనరల్ పాసుంది" అంటూ పాస్ చూపించాడు కండక్టరుకి. రూపాయి తిరిగిచ్చేసి, నవ్వుకుంటూ మరొకరికి టిక్కట్టిచ్చే ప్రయత్నంలో పడ్డాడు కండక్టరు.

చిక్కడ్‌పల్లిలో బస్సాగటం, ప్రకాశం దిగటం జరిగాయి క్షణాల్లో.

ప్రకాశానికి ఏం చేయాలో తోచటంలేదు. ఎలా ఆ రూపాయిని వదిలించుకోవాలో అర్థం కావటంలేదు.

ఆ రూపాయితో ఇంటికి వెళ్ళబుద్ధి కాలేదు ప్రకాశానికి. ఇంటి కెళ్ళినా రాత్రి తనకు నిద్ర పట్టదని తెలుసు ప్రకాశానికి.

బుర్రలో మళ్ళా మెరుపు మెరిసింది ప్రకాశానికి. కానీ ఈ మెరుపు ఇదివరకటి మెరుపుల్లా శక్తిహీనంగా కాకుండా శక్తివంతంగా వుందని పించింది ప్రకాశానికి.

అందుకే దేవాలయం వైపు నడిచాడు అందులోనూ వెంకటేశ్వర స్వామి దేవాలయం వైపు నడిచాడు.

గుడిలో ప్రవేశించి, రూపాయిబిళ్ల మనసుచుట్టూ తిరుగుతుండగా అతను గుడిచుట్టూ తిరిగాడు.

విగ్రహం ఎదురుగా నిలబడి, కళ్ళు రెండూ మూసుకుని దండం పెట్టాడు. ఆశ్చర్యం! కళ్ళు మూసుకున్నాకూడా రూపాయే కనిపిస్తోంది.

కళ్ళు తెరిచి బొట్టు పెట్టుకున్నాడు—

"హిరణ్యగర్భా......" అంతవరకే వినిపించేలాగ, ఆ తర్వాత ఏదోగొణుక్కుంటూ చదువుతూ ఆచారి పాదుకలు (ఎవరివి?) ప్రకాశం నెత్తిమీద పెట్టాడు.

వెంటనే ప్రకాశం రూపాయి బిళ్ళని ఆచారి పళ్ళెంలో పడేశాడు. తాంబూలపైసలడగాలా, ముప్పావలా అడగాలా అనే ఆలోచనలో వున్నాడు ప్రకాశం.

కానీ ఆ రూపాయి పళ్ళెంలో పడీపడగానే— 'బాబూ! ఈ రూపాయి చెల్లదు. భక్తితో ఆయొక్క భగవంతునికి సమర్పించేవి మంచిగా వుండాలి కదా!' అన్నాడు ఆచారి రూపాయి తిరిగి ఇచ్చేస్తూ.

'దేవుడి గుళ్లో ఎవరు పట్టించుకుంటార్లే!' అనుకున్న ప్రకాశం చిన్నబోయాడు. అయితే అమ్మవారి కెదురుగా నించున్న ఇద్దరు కాలేజీ

అమ్మాయిలు తనకేసి గుట్టుగా చూసి గట్టిగా నవ్వుకోవటంతో మరింత చిన్నబుచ్చుకున్నాడు ప్రకాశం. అయితే అదేమీ పైకి కనబడనీయకుండా—

"ఓహ్ అయాం సారీ! నేను చూసుకోలేదు. అదిలా ఇవ్వండి!" అంటూ తీసుకుని, జేబులోంచి పదిపైసలు తీసి ఆచారి పళ్ళెంలో వేశాడు ప్రకాశం.

అమ్మవారి దగ్గిర నిలబడి తీర్థం తాగి "దక్షిణ, దక్షిణ" అని అమ్మవారి తాలూకు ఆచారి గోలపెడుతున్నా వినిపించుకోకుండా గుడి బైటకు వచ్చాడు.

ప్రకాశం మరీ అప్‌సెట్ అయిపోయాడు— దేవుడిగుళ్లో కూడ తన పాచిక పారనందుకు.

"బాబూ! ధరమం!!"

"సీకాల్మొక్కుత. పైసెయ్ దొర!"

గుడిబైట ఆడుకుంటున్న ముష్టివాళ్ళు ప్రకాశాన్ని ఆకర్షించారు. "సీకాల్మొక్కుత పైసెయ్యిదొర" అంటున్న గుడ్డి ముష్టివాడు మరీ ఆకర్షించాడు.

వాడి దగ్గిరగావెళ్ళి "రూపాయి చిల్లరుందా?" అడిగాడు ప్రకాశం.

"ఉంది దొరా"

'తొంభయి పైసలియ్యి. రూపాయిస్తాను!' ఠీవిగా అన్నాడు ప్రకాశం.

ఒక అర్ధరూపాయి, ఒక ఇరవై పైసల బిళ్ళ, రెండుపది పైసలు తడిమితడిమి ఇచ్చాడు గుడ్డి ముష్టివాడు.

తీసుకుని వాడి చేతిలో సత్తురూపాయి పడేశాడు ప్రకాశం. ఇందాకట్నించీ ప్రకాశం కేసే గుడ్లప్పగించి చూస్తున్న కుంటి ముష్టివాడు ఆ సత్తురూపాయని కనిపెట్టేసి నోరు మెదప బోయాడు.

వాడు నోరు మెదిపి ఏమంటాడో ప్రకాశానికి తెలుసు. వాడు నోరు మెదిపితే ఏం జరుగుతుందో ప్రకాశానికి తెలుసు.

అందుకే వెంటనే వాడి చేతిలో ఇరవై పైసల బిళ్ళ పడేశాడు. ప్రకాశం అనుకున్నట్టుగానే వాడి నోరు మూతపడిపోయింది.

గుడ్డి ముష్టివాడు ఎక్కడ సత్తురూపాయని వాసన చూసి గోల చేస్తాడోనని వేగంగా నడిచి వెళ్ళిపోయాడు ప్రకాశం.